
ఏకపక్ష తీర్పులో ఎన్నో అనుమానాలు

● నమ్మశక్యం కాని రీతిలో ఫలితాలు ● ఈవీఎంల ట్యాంపరింగ్, కూటమి కుట్రలపై సర్వత్రా చర్చ
● ఆలూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి స్వల్ప మెజార్టీపై ఆశ్చర్యం



ఆలూరు రూరల్/ఆలూరు: మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గంలో ఓటర్లు ఓటు వేయడానికి పోటెత్తారు. 2,09,080 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 294 పోలింగ్ కేంద్రాల్లో 80.72 పోలింగ్ శాతం నమోదు అయ్యింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన విరూపాక్షికి 20 వేల వరకు మెజారిటీ వస్తుందని ఓటర్లు, ప్రజలు అంచనా వేసుకున్నారు. ఈ నెల 4న జరిగిన ఓట్ల లెక్కింపులో విరూపాక్షికి 2,858 ఓట్ల మెజారిటీ మాత్రమే దక్కడంతో ఆలూరు నియోజకవర్గ ఓటర్లు సందిగ్ధంలో పడ్డారు. అధిక మొత్తంలో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసినా మరీ ఇంత తక్కువ మెజారిటీ రావడంతో సందేహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చేసిన మేలు, మంచిని గుర్తు చేసుకుంటూ ఓటు వేసినా మెజారిటీ తగ్గడంతో అనుమానులు వ్యక్తం చేస్తున్నారు.

ఏదో కుట్ర జరిగింది



జగన్‌మోహన్ రెడ్డి ద్వారా మంచి జరిగిందని ఓటు వేశాం. నాతో పాటు చాలా మంది మహిళలు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిచిన విరుపాక్షికి తక్కువ మెజారిటీ రావడం అనుమానంగా ఉంది. 15 వేల కంటే ఎక్కువగా మెజారిటీ వస్తుందని అనుకున్నాం. చాలా తక్కువ ఓట్లతో గెలవడం వెనుక ఏమైనా జరిగి ఉంటుందనుకుంటున్నా.

– పార్వతి, ఆలూరు

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారు



దేవనకొండ మండలంలో వైఎస్సార్‌సీపీకి అధిక మెజార్టీ వస్తుందని భావించాం. ఎంతో కష్టపడి శాయశక్తులా వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేశాం. ఏమి జరిగిందో తెలియదు గానీ మండలంలో టీడీపీకి 961 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈవీఎం మిషన్లను ట్యాంపరింగ్ చేశారనే అనుమానం ఉంది. దీన్ని కచ్చితంగా తెలుసుకుంటాం.

– హంపయ్య, దేవనకొండ,

నిజం నిగ్గు తేల్చాలి



ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షికి తక్కువ మెజారిటీ రావడం అనుమానంగా ఉంది. అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకత లేదు. మా తొగలగల్లు గ్రామంలో ఎక్కువ శాతం మంది విరుపాక్షికే ఓటు వేశారు. అయినా మా గ్రామంలో టీడీపీకి మెజారిటీ వచ్చింది. ఈ విషయం అర్థం కావడం లేదు. ఏదో కుట్ర జరిగింది. విచారణ జరిపి నిజనం నిగ్గు తేల్చాలి.

– లక్ష్మన్న, తొగలుగల్లు గ్రామం, ఆస్పరి మండలం

ఫలితాలు అనుమానాస్పదం



రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి మెజార్టీ తగ్గి కేవలం 11 స్థానాలకే పరిమితం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షికి కేవలం 2 వేల పైచిలుకు మెజార్టీ రావడంపై కూడా అనుమానాలు ఉన్నాయి. నియోజకవర్గమంతా వైఎస్సార్‌సీపీకే ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఓటు వేశారు. కానీ మెజార్టీ తగ్గడం అయోమయానికి గురి చేసింది.

– వడ్డె శంకరప్ప, గూళ్యం గ్రామం, హాలహర్వి మండలం,

ఇలాంటి ఫలితాలు ఊహించలేదు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చారు. ప్రజల్లో ఆయనపై ఎంతో విశ్వాసం నెలకొంది. వైఎస్సార్‌సీపీ తిరుగులేని ఫలితాలు సాధిస్తుందని అనుకున్నాం. ఎందుకింత దారుణంగా వచ్చాయో అర్థం కావడం లేదు. పార్టీకి పట్టున్న గ్రామాల్లోనూ ఓట్లు రాలేదు. వైఎస్సార్‌సీపీ గెలుపు కచ్చితమనుకున్న పత్తికొండలో టీడీపీ విజయం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈవీఎంల విషయంలో ఏదైనా జరిగిందోమోననే అనుమానం కలుగుతోంది.

–ముజిబుర్ రహిమాన్, దూదేకొండ, పత్తికొండ మండలం

సర్వే సంస్థలు సైతం ఊహించలేదు



ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజలకు చేసినంత మేలు ఎవరూ చేయలేదు. అయినా ఆ పార్టీ కేవలం 11 స్థానాల్లో గెలుపొందడం చూస్తే ఆశ్చర్యమేస్తోంది. సర్వే సంస్థలు చెప్పిన వివరాలన్నీ తప్పుకావడం, ఏకపక్షంగా ఒక వ్యక్తి చెప్పిన ఎగ్జిట్ పోల్స్‌కు తగ్గట్టు ఫలితాలు రావడం చూస్తే అనుమానం కలుగుతుంది. దీని వెనుక కుట్రను నిగ్గుతేల్చాలి.

–ఈశా, హొళగుంద

నమ్మశక్యంగా లేదు



ఆలూరులో అతి తక్కువ మెజార్టీతోనే ఎమ్మెల్యేగా విరూపాక్షి గెలుపొందారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూటమి అభ్యర్థులే అత్యధిక మెజార్టీతో గెలుపొందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగి ఉండొచ్చన్న అనుమానాలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆకర్షితులయ్యారు. వారి ఓట్లు ఏమయ్యాయో తెలియడం లేదు.

–హరిజన ఉరుకుందప్ప, నిట్రవట్టి గ్రామం

క్లుప్తంగా

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



విత్తనాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

మద్దికెర: ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హంప గ్రామంలో రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. హంప పంచాయతీకి 200 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని.. సాగు చేసే రైతులందరికీ అందజేస్తామని తెలిపారు.విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు.

ఓటర్లకు రుణపడి ఉంటాం



మాట్లాడుతున్న పచ్చారపల్లి రామిరెడ్డి

హాలహర్వి: సార్వత్రిక ఎన్నికలు -2024లో ఆలూరు నియోజకవర్గం నుంచి పోటీలో నిలిచిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరూపాక్షి గెలుపునకు కృషి చేసిన ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పచ్చారపల్లి రామిరెడ్డి తెలిపారు. అలాగే ఓటర్లకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్కంఠగా జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో 2813 ఓట్ల మెజార్టీతో సమీప టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్‌పై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విరూపాక్షి విజయం సాధించాడన్నారు. ఈ గెలుపు ప్రతికార్యకర్త, నాయకులు, అభిమానులకు సొంతమన్నారు. ఎమ్మెల్యే విరూపాక్షి సారథ్యంలో మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

టీబీ నివారణపై అవగాహన

ఆదోని టౌన్: రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ బాబురాజు సూచించారు. ఆయన బుధవారం స్థానిక హెల్త్ సెంటర్‌లో రోగులకు టీబీ లక్షణాలు, నివారణ చర్యలపై వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, గళ్లలో రక్తపుచారలు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉన్నవారు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

కూల్‌డ్రింక్ షాప్‌లో చోరీ



షాప్ వెనకవైపు రేకును కట్ చేసి చోరీకి పాల్పడిన దొంగలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డులో రెడ్‌చిల్లీ రెస్టారెంట్ పక్కన ఉన్న కూల్‌డ్రింక్ షాప్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రెస్టారెంట్ మూసివేశారు. ఇదే అదునుగా భావించిన దొంగలు కూల్‌డ్రింక్ షాప్ వెనకవైపు రేకును కట్ చేసి చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఉదయం షాప్ తెరిచేందుకు వచ్చిన యజమాని తపాల్ ముఖీమ్ షాప్ వెనక భాగం కట్ చేసి ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. షాప్‌లోని రూ.10 వేలు విలువ చేసే కూల్ డ్రింక్స్, సిగరెట్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పట్టణ పోలీసులు చెప్పారు.

గడ్డివామి దగ్ధం



మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

గోనెగండ్ల: స్థానిక లక్ష్మీపేట కాలనీకి చెందిన గొల్ల సోమన్నకు చెందిన గడ్డివాము నిప్పంటుకుని దగ్ధమైంది. దాదాపు రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయారు. బాధితుడు తెలిపిన వివరాలు.. సోమన్నకు చెందిన ఏడు ఎకరాల పొలంలో పండించిన వేరుశనగ గ్రాసంను కాలనీ సమీపంలో గడ్డివాముగా వేసుకున్నాడు. అయితే బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టారని బాధితుడు వాపోయాడు. మంటలు ఎగసి పడటంతో గుర్తించిన స్థానికులు అదుపుచేసే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. గడ్డివాము పూర్తిగా కాలిపోవడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు



ఎమ్మెల్యే విరుపాక్షికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఆలూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలవ్వడంతో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని అందరికీ అండగా ఉంటానని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి భరోసా ఇచ్చారు. చిప్పగిరి గ్రామంలో బుధవారం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, సింగిల్ విండో అధ్యక్షులు, డైరెక్టర్లు తదితరులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. నియోజకవర్గానికి 16వ ఎమ్మెల్యేగాను మూడోసారి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా బుసినే విరుపాక్షి గెలుపొందడంతో శుభాకాంక్షలు తెలిపారు. మిఠాయిలను తినిపించి సంతోషం పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కష్టపడి పని చేసిన వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆలూరు అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్

ఆలూరు రూరల్: ఆలూరులో టీడీపీ ఓడిపోయిందని కార్యకర్తలు అధైర్యపడొద్దని, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో తనకు సహకరించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు నియోజకవర్గ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఆలూరులో టీడీపీ ఓడిపోవడం దురదృష్టకరం అన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలో వచ్చిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు త్వరలోనే ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. నాయకులు, కార్యకర్తల సహకారంతో ఆలూరు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. సమావేశంలో ఆలూరు మండల కన్వీనర్ అశోక్ యాదవ్, నాయకులు రాంనాథ్ యాదవ్, అంజినయ్య, తిమ్మప్ప, జగన్, తదితరులు ఉన్నారు.

వంద టన్నుల వేరుశనగ విత్తనాలు పంపిణీ

కృష్ణగిరి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు వంద టన్నుల సబ్సిడీ వేరుశనగ విత్తనాలు రైతులకు పంపిణీ చేసినట్లు ఏఓ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. మండలానికి ఈ ఏడాది 1,100 క్వింటాళ్లు కేటాయించినట్లు చెప్పారు. అందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి అయ్యిందన్నారు. ఇప్పటి వరకు రైతులకు వెయ్యి క్వింటాళ్ల (100 టన్నులు) కాయలు అందజేశామని, మరో వంద క్వింటాళ్లు రావాల్సి ఉందన్నారు. వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు. వర్షాలు పడుతుండడంతో పంటసాగు చేసే రైతులు విత్తనశుద్ధి తప్పక చేయాలని సూచించారు.

ఇంటి ముందు బాణాసంచా కాల్చొద్దన్నందుకు దాడి

కృష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇంటి ముందు బాణాసంచా కాల్చవద్దని చెప్పినందుకు దాడి చేసిన ఘటనపై గ్రామానికి చెందిన ఐదుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన బోయ సురేష్ తన బామర్ది కృష్ణకుమార్‌తో కలిసి పొలం నుంచి సాయంత్రం బైక్‌పై ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి ముందు బాణాసంచా కాల్చుతున్న బాలమద్ది, శివ, నాగరాజు, మధు, భాస్కర్‌నాయుడులను పక్కకు వెళ్లి కాల్చుకోమని చెప్పాడు. అందుకు నువ్వు ఎవడివిరా అంటూ అతనిపై దాడి చేశారు. ఇతన్ని విడిపించేందుకు ప్రయత్నించిన కృష్ణకుమార్, మహేష్‌లపై కూడా దాడి చేసి గాయపర్చారు. బాధితుడు సురేష్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తీరని నీటి కష్టాలు



హొళగుందలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

హొళగుంద: రెండు నెలలుగా నీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక కుమ్మరివీధికి చెందిన మహిళలు బుధవారం పంచాయతీ కార్యాలయానికి తరలి వచ్చి నిరసన తెలిపారు. ఆ వీధికి చెందిన బండెమ్మ, పార్వతి, విజయమ్మ, బసమ్మ, రంగన్న తదితరులు పిల్లలతో సహా ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యలయానికి వచ్చి సెక్రటరీ రాజశేఖర్‌కు సమస్యను వివరించారు. వారు మాట్లాడుతూ.. తమ వీధిలో నెలల తరబడి నీరు రావడం లేదని, అంతంత మాత్రంగా ఉన్న సమస్య వేసవిలో జఠిలంగా మారిందని వాపోయారు. చాలా కాలం క్రితం వేసిన పైప్‌లైన్‌లో సమస్య తలెత్తడంతో దిగువన ఉన్న తమ ఇళ్లకు నీటి సరఫరా జరగడం లేదని వివరించారు. నీటి కోసం ఇంటిల్లిపాది రాత్రింబవళ్లు కొళాయిల ముందు పడిగాపులు కాస్తున్నా నీరు అందడం లేదని చెప్పారు. గతంలో బాగావస్తున్న నీరు ఇప్పుడెందుకు రావడం లేదని, ఎగువ భాగంలో భారీ మోటార్లు పెట్టడం లేదా పైపులైన్ దెబ్బతినిఉంటుందని వెంటనే మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్కడే బైఠాయించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సెక్రటరీ రాజశేఖర్, సర్పంచ్ కుమారుడు పంపాపతి హామీ ఇవ్వడంతో వారు ఇంటిముఖం పట్టారు.

రోగులు సంతృప్తి చెందేలా వైద్య సేవలు

ఓర్వకల్లు: ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు సంతృప్తి చెందేలా వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఓర్వకల్లు మండలం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కన్నమడకల సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగే ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది కార్యక్రమం నిర్వహించే ఒక్క రోజు ముందే ఆరోగ్య సేవలు అవసరమైన వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఓపీకి వచ్చే రోగులందరికీ అవసరమైన రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలన్నారు. మధ్యాహ్న సమయంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులకు వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు చేసి ఆ వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. అందులో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి మందులు, తగిన సూచనలు అందజేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలో జరిగిన టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ రిపోర్టులను పరిశీలించారు. ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని గర్భిణులు, పిల్లలకు సకాలంలో వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. ప్రధానంగా ఎంఆర్-1, ఎంఆర్-2 వ్యాక్సిన్లు వంద శాతం పూర్తిచేసి, వాటి వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రేఖా, జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ ప్రసాద్, ఎంపీహెచ్‌ఓ రాబర్ట్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నీటి దందా

● మినరల్ పేరిట మోసం
● ఐఎస్‌ఐ ధ్రువీకరణ లేకుండానే నీటి అమ్మకం
● నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్ నిర్వాహకులు
● చోద్యం చూస్తున్న అధికారులు



ఆలూరు పట్టణంలోని వాటర్ ప్లాంట్

ఆలూరు రూరల్: పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రజలు మినరల్ వాటర్‌నే అధికంగా వినియోగిస్తున్నారు. ఫలితంగా శుద్ధిచేసిన నీటికి అలవాటు పడ్డారు. ఆలూరు నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో 40కు పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో 60 శాతం వాటికి అనుమతులు లేవు. సాధారణంగా పంచాయతీ ద్వారా పట్టణంతో పాటు అన్ని గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో గ్రామీణ తాగునీటి సరఫరా సరిగా లేని కారణంగా ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్లలో లభ్యమయ్యే తాగునీటికి అలవాటు పడ్డారు. ఈ నేపథ్యంలో క్యాన్ నీళ్లకు డిమాండ్ పెరిగింది. చాలా మంది ఆటోల్లో క్యాన్లను ప్లాంట్ల వద్దకు తీసుకెళ్లి నీళ్లు నింపి ఇళ్ల వద్దకు వచ్చి అమ్ముతున్నారు. చిన్న టీకొట్టు దగ్గర నుంచి పెద్ద హోటళ్ల వరకు ఈ నీటినే వాడుతున్నారు. దీంతో మినరల్ వాటర్‌కు డిమాండ్ ఉండడంతో మినరల్ ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా మినరల్ వాటర్ పేరిట జనరల్ వాటర్ సరఫరా చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ అధికారులు కళ్లు మూసుకున్నారు.

శుద్ధి చేస్తున్న తీరు ఇది..

మినరల్ వాటర్ ప్లాంటు యజమానులు ముందుగా బోరు వేసి అక్కడ ఒక గదిని ఏర్పాటు చేసుకుని నీటిని శుద్ధి చేస్తామని చెబుతారు. నీరు రుచిగా ఉండడానికి సోడియం ఫ్లోరైడ్, సోడియం కార్బొనేట్ వంటి పౌడర్లు కలుపుతారు. ప్లాంట్లలో పనిచేసే వారు చేతులకు గ్లౌజ్‌లు వంటి వేసుకోకుండా నీటిని నింపుతారు. క్యాన్లలో ఆటోల ద్వారా ట్యాంకుల్లో నింపి విక్రయిస్తున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ప్రమాణాలు పాటిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకే మినరల్ వాటర్‌ను విక్రయించాలి. అలా కాకుండా ఇష్టానుసారంగా మినరల్ వాటర్‌ను విక్రయిస్తే చర్యలు తప్పవు. రివర్స్ ఆస్మాసిస్ ప్రక్రియ ద్వారా నీటిని శుద్ధి చేయాలి. ప్లాంట్ నిర్వహణకు పంచాయతీ అనుమతులు తీసుకోవాలి. నిబంధనలు పాటించని యజమానులపై కేసులు నమోదు చేస్తాం.

–ప్రకాష్ నాయుడు, పత్తికొండ ఇన్‌చార్జ్ డివిజనల్ పంచాయతీ అధికారి,

ఇవి నిబంధనలు...

- ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఐఎస్‌ఐ సర్టిఫికెట్ ఉండాలి.
- 12 రకాల ధ్రువీకరణ పత్రాలు ప్లాంట్ యజమానులు పొందాలి.
- అత్యున్నత సాంకేతికత కలిగిన మిషన్లతో నీటిని శుద్ధి చేయాలి.
- నీటిని పరీక్షించడానికి ఒక ల్యాబ్ ఏర్పాటు చేసుకుని, రోజూ శుద్ధ చేసిన నీటిని పరీక్షించాలి.
- వాటర్ ప్యాకెట్ల తయారీలో 60 మైక్రాన్ల కంటే ఎక్కువగా ప్లాస్టిక్‌ను వినియోగించాలి.
- ఐఎస్‌ఐ ముద్రను తప్పనిసరిగా ముద్రించాలి.
- ప్యాకెట్ల కాలపరిమితి గడువును తప్పక ముద్రించాలి. తయారైనప్పటి నుంచి 21 రోజుల్లో వాటిని విక్రయించాలి.
- ఇళ్ల మధ్య భూమిలో నీటిని వినియోగించకూడదు. పంచాయతీ అనుమతి తీసుకుని పైప్‌లైన్ ద్వారా నీటిని వినియోగించుకోవాలి.
- ప్రతి 15 రోజులకు ఒకసారి ల్యాబ్ రిపోర్ట్ ఇవ్వాలి.

ఇష్టమొచ్చిన ధరకు అమ్మకాలు



విక్రయించేందుకు ఆటోల్లో తరలిస్తున్న వాటర్ క్యాన్లు

వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలు పట్టించుకోకుండా నీటిని క్యాన్లలో నింపి ధరలను కూడా ఇష్టానుసారంగా విధిస్తున్నారు. 20 లీటర్ల నీటిని రూ. 15 నుంచి రూ.20 వరకు అమ్ముతున్నారు. వంద ప్యాకెట్ల వాటర్ బ్యాగును రూ. 60 వరకు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకుని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సి.బెళగల్: మండల పరిధిలోని సంగాల గ్రామంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. సంగాల గ్రామానికి చెందిన బైటిగేరి శేఖర్ ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, ఇన్‌ఫార్మర్ వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు

కోడుమూరు రూరల్: గ్రామాల్లో వలసల నివారణలో భాగంగా అవసరమైన కూలీలందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఏపీఓ మోదీన్ బాషా ఆదేశించారు. బుధవారం మండలంలోని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ఈసీ వెంకటేష్‌తో కలిసి సమావేశమయ్యారు. ఉపాధి పనులపై చర్చించారు. కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో మండలంలోని చాలా గ్రామాల్లో ఉపాధి పనులు నిలిచిపోయాయని, వర్షాలు ఆగిపోయినందున తిరిగి అయా గ్రామాల్లోని కూలీలందరికీ పనులు కల్పించాలని ఏపీఓ సిబ్బందిని ఆదేశించారు. అలాగే పనుల్లోకి వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాలని, ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిదినాలు కచ్చితంగా కల్పించాలన్నారు. ఈ ఏడాది ఉపాధి పథకం కింద 400 ఎకరాల్లో చిన్న, సన్న కారు రైతుల పొలాల్లో పండ్లతోటలు సాగు చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, ఇప్పటి వరకు కేవలం 100 ఎకరాల్లో మాత్రమే పండ్ల తోటలను సాగు చేయించామని, వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఏపీఓ సిబ్బందికి సూచించారు.